క్లుప్తంగా

ప్రశాంతక్క.. రాజకీయాలు మానుకో



మాట్లాడుతున్న రాజేంద్రకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్‌: కోవూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రాజకీయాలు మానుకుంటే మంచిదని నల్లపరెడ్డి రాజేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని జొన్నవాడ గ్రామంలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. నెల్లూరులో జరిగిన విలేకరుల సమావేశంపై ఇప్పటివరకు స్పందించలేదని, అంటే నిజం ఒప్పుకున్నట్టేగా అని విమర్శించారు. ప్రశాంతిరెడ్డి మాటలు విని ప్రభాకర్‌రెడ్డి టీడీపీలో చేరినట్లు తెలిపారు. నల్లపరెడ్డి సురేష్‌రెడ్డిని తమపై విమర్శలు చేసేందుకు ప్రశాంతిరెడ్డి వాడుకుంటోందన్నారు. సురేష్‌రెడ్డిని ఎప్పటి నుంచో తమ కుటుంబం దూరంగా పెట్టిందన్నారు. అటువంటి వ్యక్తిని తమపై బురద జల్లేందుకు ప్రశాంతిరెడ్డి వాడుకోవడం మంచిది కాదని హితవు పలికారు.

రూ.8 లక్షల నగదు స్వాధీనం



పట్టుకున్న నగదుతో ఎస్సై

కోవూరు : ఎన్నికల కోడ్‌ నేపథ్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.8 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై రంగనాథ్‌గౌడ్‌ తెలిపారు. కోవూరు మెయిన్‌రోడ్డులో అంబేడ్కర్‌ విగ్రహం సమీపంలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీనిని ట్రెజరీకి అప్పగించామని వివరించారు.

వెంకటాచలంలో..

వెంకటాచలం : ఎన్నికల నేపథ్యంలో వెంకటాచలం టోల్‌ప్లాజా సమీపంలోని చెక్‌పోస్టు వద్ద రూ.3.31 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకులో నగదును జమ చేసేందుకు టోల్‌ప్లాజా సిబ్బంది వెళ్తుండగా, పోలీసులు తనిఖీ చేశారు. సిబ్బంది వద్ద ఉన్న రూ.3.31 లక్షలకు సంబంధించిన బిల్లులు చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

వెంకటాచలం: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ కె.ఆరిఫ్‌ హఫీజ్‌ బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి, పోలీస్‌ అధికారులతో పలు కేసులు గురించి చర్చించారు. ఎన్నికల నేపథ్యంలో విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీకే మాలమహానాడు మద్దతు

• జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ

పొదలకూరు : సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే మాల మహానాడు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు పొదలకూరు మండలానికి చెందిన జిల్లా మాలమహానాడు ఉపాధ్యక్షుడు కొప్పోలు సూర్యనారాయణ వెల్లడించారు. ఆయన బుధవారం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి దళితుడికి న్యాయం జరిగిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మాల మహానాడు అధినాయకులు మద్దతు ప్రకటించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. సర్వేపల్లిలో కాకాణి గోవర్ధన్‌రెడ్డిని గెలిపిస్తేనే సంక్షేమం, అభివృద్ధి నిరాటంకంగా అమలవుతాయన్నారు.

వృద్ధులకు నిత్యావసర సరుకుల వితరణ

నెల్లూరు సిటీ: ఏపీ ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్‌ పాశం శ్రీనివాస్‌ పుట్టిన రోజును పురస్కరించుకుని గీతామయి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బుధవారం నిత్యావసర సరుకులు వితరణ చేశారు. అపోలో ఆస్పత్రి సమీపంలోని శ్రీనివాస్‌ నివాసంలో జరిగిన జన్మదిన వేడుకల్లో డీసీసీబీ మాజీ చైర్మన్‌ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్‌ కొండ్రెడ్డి రంగారెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. రూరల్‌ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేకంగా ఫోన్‌ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు గునపాటి రమేష్‌రెడ్డి, ఏంబేటి ఏసునాయుడు, సీహెచ్‌ హరిబాబుయాదవ్‌, వేలూరు శ్రీధర్‌రెడ్డి, వేలూరు శివ సునీల్‌రెడ్డి, ముడియాల రామిరెడ్డి, కొండేటి శివారెడ్డి, యాకసిరి శరత్‌చంద్ర, తాళ్లూరు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డికి భంగపాటు తప్పదు

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న మంత్రి కాకాణి

మనుబోలు : ఎన్నికలప్పుడు మాత్రమే మెరిసే అల్లీపురంరెడ్డి (సోమిరెడ్డి)కి రాబోయే ఎన్నికల్లో మరోసారి భంగపాటు తప్పదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని కాగితాలపూరు, ఎల్‌ఎన్‌పురం, పిడూరు గ్రామాల్లో బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సోమిరెడ్డికి ఓట్లు యావే తప్ప ప్రజల గోడు పట్టదన్నారు. గతంలో మిల్లర్లతో కుమ్మక్కై రైతులను నట్టేట ముంచాడన్నారు. దీనివల్లే గతంలో ధాన్యానికి గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. తాను వ్యవసాయ శాఖ మంత్రి అయ్యాక మిల్లర్లను దూరం పెట్టి పారదర్శకంగా వ్యవహరించడం వల్లే ధాన్యానికి గతంలో ఎన్నడూ లేనంత ధర లభిస్తోందన్నారు. రైతులకు సకాలంలో సాగునీరు అందించడమే కాకుండా వారికి అవసరమైన వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, విత్తనాలను ఆర్బీకేల ద్వారా సకాలంలో అందించామన్నారు. అభివృద్ధి సంక్షేమం కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించి గెలిపించాలని కోరారు. అనంతరం కాగితాలపూరు దర్గాలో ప్రార్థనలు చేశారు.

వైఎస్సార్‌సీపీలో 30 కుటుంబాల చేరిక

కాగితాలపూరు గ్రామానికి చెందిన పోలిశెట్టి పిచ్చయ్య, ఎల్‌ఎన్‌పురంలో చిరుమావిళ్ల మధుసూదన్‌ నాయుడు తదితరుల ఆధ్వర్యంలో ముస్లిం కుటుంబాలతో కలిపి సుమారు 30 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి కాకాణి వారిని కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు మాజీ సర్పంచ్‌ మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, వైస్‌ ఎంపీపీ తిక్కవరపు వెంకటరమణారెడ్డి, సర్పంచ్‌ చెముడుగుంట ఏడుకొండలు, ఎంపీటీసీలు గుమ్మడి వెంకటసుబ్బయ్య, ఉప్పలపాటి రామసుబ్బానాయుడు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు కాకాణికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, పార్టీ నేతలు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గుండాల ఆదినారాయణ, మన్నెమాల సుధీర్‌రెడ్డి, మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, కసిరెడ్డి ధనుంజయరెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్‌, జగదీష్‌, నవకోటి, దయాకర్‌, రమేష్‌, గిరి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో కాకాణి

సంక్షేమ పాలనకు ఆకర్షితులై..



పార్టీలో చేరిన వారితో మస్తాన్‌రావు, ప్రసన్నకుమార్‌రెడ్డి, కల్యాణ్‌ చక్రవర్తి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్‌ : మండలంలోని ఇస్కపాళెం పంచాయతీకి చెందిన కె.శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో వంద మంది టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి జొన్నవాడ గ్రామంలో బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌ చక్రవర్తి, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో సముచిత స్థానం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. ప్రసన్నకుమార్‌రెడ్డి విజయానికి తమవంతు కృషి చేస్తామని వివరించారు.

అభివృద్ధి, సంక్షేమమే గెలిపిస్తాయి



ముత్తుకూరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పూజిత



ఇందుకూరుపేట: ఎన్నికల ప్రచారంలో నాయకులు

ముత్తుకూరు : సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తన తండ్రిని గెలిపిస్తాయని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత పేర్కొన్నారు. ముత్తుకూరు పట్టణంలో ఆమె ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014, 2019 ఎన్నికల్లో తాను ముత్తుకూరు ఎన్నికల ప్రచారానికి వచ్చానని గుర్తుచేశారు. గత ఐదేళ్ల కాలంలో ఎన్నో సమస్యలు తన తండ్రి ద్వారా పరిష్కారం అయినట్లు తెలిపారు. తొలుత పూజితకు పెద్ద ఎత్తున మహిళలు స్వాగతం పలికారు.

ప్రతి గడపకు సంక్షేమం

ఇందుకూరుపేట: ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ మావులూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని గంగపట్నం గ్రామంలో బుధవారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ కుటుంబానికి మేలు జరిగి ఉంటేనే ఎన్నికల్లో ఓటు వేయాలని కోరిన ఎకైక నాయకుడు జగన్‌ అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పంబాల జనార్దన్‌రెడ్డి, కేతిరెడ్డి సతీష్‌రెడ్డి, వేణుంబాక మహీధర్‌రెడ్డి, దండిగుంట ఫణీంద్రనాయుడు, మారుబోయిన సంతోష్‌గౌడ్‌ పాల్గొన్నారు.

మంత్రి ఎన్నికల ప్రచారం నేడు

పొదలకూరు : మండలంలోని పలు గ్రామాల్లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని సొసైటీ చైర్మన్‌ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రభగిరిపట్నం, 11 గంటలకు అమ్మవారిపాళెం, 2 గంటలకు బత్తులపల్లి, 3 గంటలకు నేదురుమల్లి, 4 గంటలకు వెలికంటిపాళెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేస్తారన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాల్సిందిగా కోరారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

పొదలకూరు : మండలంలోని ఆర్‌వైపాళెం లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం రాత్రి పోలీసులు అరెస్ట్‌ చేసి అతడి నుంచి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు జరిపారు. ఈ మేరకు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని పట్టుకున్నారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఎస్సై హెచ్చరించారు.

12 బాటిళ్ల పట్టివేత

వెంకటాచలం : మండలంలోని సర్వేపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సర్వేపల్లిలోని మద్యం షాపు నుంచి ఈదగాలి గ్రామానికి చెందిన పోలయ్య అనే వ్యక్తి 12 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి

• ఎస్పీ ఆరిఫ్‌ హఫీజ్‌



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

మనుబోలు : ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించాలని ఎస్పీ ఆరిఫ్‌ హఫీజ్‌ సూచించారు. మనుబోలు పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఏఏ గ్రామాల్లో గొడవలు జరిగే అవకాశం ఉందో రికార్డులు పరిశీలించారు. గతంలో జరిగిన ఎన్నికల సందర్భంగా నమోదైన కేసులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట పొదలకూరు సీఐ రాంబాబు, నెల్లూరు స్పెషల్‌ బ్రాంచ్‌ ఇన్‌స్పెక్టర్‌ రామకృష్ణారెడ్డి ఉన్నారు.

రూ.లక్ష నగదు స్వాధీనం

ఎన్నికల నేపథ్యంలో బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద హైవేపై ఏర్పాటు చేసిన పోలీస్‌ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా బస్సులో ఎటువంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.లక్ష నగదును బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చెన్నై నుంచి నెల్లూరు వస్తున్న బస్సులో విక్రమ్‌ అనే వ్యక్తి వద్ద ఉన్న లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అజయ్‌కుమార్‌ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ అందజేస్తున్న సీఐ హైమారావు



పొదలకూరు పట్టణంలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్‌: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ వద్ద సీఐ హైమారావు బుధవారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు వివిధ పనులపై వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

• **పొదలకూరు :** పట్టణంలోని శ్రీపొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద తాగునీటి చలివేంద్రాన్ని బాబా మందిర సేవాసమితి సభ్యుడు లక్కాకుల ఆనందరావు, యోగా గురువు పెంచలయ్య బుధవారం ప్రారంభించారు. అమరా క్లాత్‌షోరూమ్‌ ఆధ్వర్యంలో గత 22 ఏళ్లుగా ప్రతి వేసవిలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాంబాబు, సుప్రజ, చిన్నయ్య, టైలర్‌ చిన్నా, తన్నీరు సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలు వేసుకోవాలి



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారులు



కొడవలూరు: ధాన్యం ధరలను ఆరా తీస్తున్న ఏఓ లక్ష్మి

విడవలూరు: వేసవిలో వరి రెండో పంటకు సాగునీటి లభ్యత లేనందున ఆరుతడి పంటలు వేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన రైతుల సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకే పంటను వరుసగా రెండు సీజన్‌లలో వేయడం వల్ల చీడపీడల బెడద ఎక్కువగా ఉండి, సాగు ఖర్చు పెరిగి దిగుబడి తక్కువ వస్తుందన్నారు. అందుకే ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, సజ్జ, వేరుశనగ, నువ్వులు, పెసర, మినుము వంటి ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయశాఖ అధికారి వెంకటకృష్ణయ్య, ఏడీఏ లక్ష్మీమాధవి, ఏఓ మధురిమ, ఎమ్‌ఏఓ టి.అరుణ, తమీర్‌, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

ఎడగారులో ఆరుతడి పంటలు మేలు

కొడవలూరు: ఎడగారులో రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని ఏఓ లక్ష్మి రైతులకు సూచించారు. మండలంలోని కమ్మపాళెంలో రైతుల ధాన్యం విక్రయాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీ వరి పంట పూర్తయినందున ఎడగారుకు సన్నద్ధమయ్యే రైతులు నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో ఆరుతడి పంటలను వేసుకోవాలని సూచించారు. మార్కెట్‌లో ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉన్నాయని, రైతులు కూడా విక్రయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. బీపీటీ 5204 రకం ధాన్యం పుట్టి రూ.22,500 పలుకుతుండగా, కేఎన్‌ఎం 1638 రకం పుట్టి రూ.20 వేలు పలుకుతోందన్నారు. ఈ ధరలు రైతుకు లాభదాయకంగా ఉన్న దృష్ట్యా మార్కెట్‌లో విక్రయాలు చేస్తున్నారని తెలియజేశారు. ఏఓ వెంట వీఏఏ ఓ.సుజిత్‌, రైతులు ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : సంక్షేమ పాలనకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో వస్తున్న నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు బట్టేపాటి నరేంద్రరెడ్డి, కూకటి వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ముదివర్తిపాళెం, జగదేవిపేటకు చెందిన 200 కుటుంబాలు టీడీపీని వీడి ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. జగదేవిపేటలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే రాజీనామా చేసిన 20 మంది జగదేవిపేట వలంటీర్లకు ఎమ్మెల్యే పార్టీ కండువా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు సాగుతోందన్నారు. కొత్తగా పార్టీలో చేరిన వారు అందరితో సమన్వయం చేసుకుంటూ వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. కోవూరు ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా విజయసాయిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. తొలుత జగదేవిపేటలోని కదురు రాధాకృష్ణారెడ్డి, మన్నెం కుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి నివాసాలకు ఎమ్మెల్యే వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ చైర్మన్‌ గొల్లపల్లి విజయ్‌కుమార్‌, జొన్నవాడ ఆలయ చైర్మన్‌ మావులూరు శ్రీనివాసులురెడ్డి, నిడిముసలి పీఏసీఎస్‌ అధ్యక్షుడు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, పార్టీ నేతలు వై.సునీల్‌రెడ్డి, మనోహర్‌, పరమయ్య, రామయ్య, పల్లంరెడ్డి మల్లికార్జునరెడ్డి, మైపాటి శ్రీనివాసులు, రాగాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే

వైఎస్సార్‌సీపీలో చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలతో మంత్రి కాకాణి

వెంకటాచలం : మండలంలోని కాకుటూరు గ్రామంలో 12 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి కాకుటూరులో పర్యటించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వీరంతా వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి వలసలు వస్తున్నట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

వైభవంగా గంగమ్మ గ్రామోత్సవం



గంగమ్మ గ్రామోత్సవం

మనుబోలు : మనుబోలు చెరువు గట్టున వెలసిన గంగమ్మ గ్రామోత్సవాన్ని మంగళవారం అర్ధరాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకుడు సుబ్రహ్మణ్యం శర్మ గంగమ్మకు అభిషేకాలను శాస్త్రోక్తంగా జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. విశేషంగా అలంకరించిన గంగమ్మను ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం చేశారు. అడుగడుగునా భక్తులు కొబ్బరికాయలు, పూలు, పండ్లను నైవేద్యంగా సమర్పించి గంగమ్మకు మంగళహారతులు పట్టారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

వరికుంటపాడు: మండలంలోని యర్రంరెడ్డిపల్లెలో రైతుల సౌకర్యార్థం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మార్క్‌ఫెడ్‌ మేనేజర్‌ పవన్‌కుమార్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలను పరిగణలోకి తీసుకుని ఎన్‌టీజే-4, 5, సీఎస్‌వీ-24 ఎస్‌ఎస్‌ రకాల జొన్న రకాలు సాగు చేసిన రైతుల నుంచి క్వింటా రూ.3,180లకు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఒక్కో రైతు నుంచి ఐదెకరాల పంటను కొనుగోలు చేస్తామన్నారు. మార్క్‌ఫెడ్‌, జిల్లా కో-ఆపరేటివ్‌ మార్కెటింగ్‌ సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోళ్ల ప్రక్రియ నిర్వహిస్తున్నామన్నారు. ఈ డీసీఎంఎస్‌ సహాయ మేనేజర్‌ సుధాకర్‌రావు, మార్క్‌ఫెడ్‌ మార్కెటింగ్‌ ఎగ్జిక్యూటివ్‌ వేణు, ఏఓ రవికుమార్‌, రైతులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై చైతన్యం

నెల్లూరు సిటీ: చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాజాన్ని చైతన్యపరచడమే తమ లక్ష్యమని సీనియర్‌ సివిల్‌ జడ్జి కే వాణి పేర్కొన్నారు. బాలబాలికలకు రక్షణ చట్టాలపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన చైతన్య ర్యాలీని జిల్లా కోర్టు ప్రాంగణంలో బుధవారం ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి వాణి మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్‌, జిల్లా జడ్జి సీ యామిని ఆధ్వర్యంలో ఈ నెల 11 వరకు ఆపరేషన్‌ స్వేచ్ఛ కార్యక్రమం కింద బాలలందరికీ న్యాయం అనే అంశంపై చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మానవ అక్రమ రవాణా, చట్ట విరుద్ధమైన వస్తువుల కొనుగోలు, బాలలతో వెట్టిచాకిరీ, తదితర చట్టవిరుద్ధమైన అంశాలపై సమాజాన్ని చైతన్యపరచడమే తమ లక్ష్యమని వివరించారు. వివక్షతకు గురవుతున్న బాలబాలికలకు సంబంధించిన సమస్యలపై జిల్లా కోర్టు ఆవరణలోని లోక్‌ అదాలత్‌ కార్యాలయంలో సంప్రదిస్తే తగిన న్యాయం చేస్తామన్నారు. ఈ ర్యాలీలో యాంటీ హ్యూమన్‌ ట్రాఫిక్‌ టీం ఏఎస్సై సతీష్‌బాబు, లేబర్‌ అధికారులు పాల్గొన్నారు.